సవతితల్లి

[కథానిక]

= శ్రీ 'స్వైరవిహారి' =

జీతం తక్కువయినా పయిరాబడివల్లనే జీవితయాత్ర సగౌరవంగా సాగించే సదాశివరావుగారి హఠాన్మరణంతో కొడుకు ప్రకాశరావు మధ్యలో విద్యార్థిదశకు విడాకు లివ్వవలసిన పరిస్థితు లేర్పడ్డాయి. చదువుకు స్వస్తిచెప్పడమంటే శ్రమలేకుండానే సాధ్యమయిందిగాని సంసారనౌకను సక్రమంగా నడిపించడమెలాగో ప్రకాశరావుకు అవగాహన కాలేదు. సదాశివరావుగారు మరొక భాగస్వామితో కలిసి బట్టల దుకాణం పెట్టడంలో వచ్చిన నష్టమూ, అందుమీద పెరిగిన వడ్డీ (మొత్తం ఏడు వేలు) ఆయన ప్రావిడెంటు ఫండు నాలుగు వేలూ, యిల్లు అమ్మగా వచ్చిన నాలుగు వేలలో మూడు వేలూ పెట్టి తీర్చేసేడు. ఆ రెండవ వంతుదారు ప్రకాశానికి ఏదో ఉద్యోగం అయేదాకా తన పాతయింట్లో అద్దె యివ్వకుండానే ఉండమనడమే కాకుండా ప్రకాశాన్ని చాలా మంచివాడనీ, పరువు మర్యాదలు కలవాడనీ నలుగురితోనూ చెప్పేవాడు. అత నలా చెప్పడానికి కారణం లేకపోలేదు; తాను దుకాణంమీద తిన్న లాభనష్టాలను విచారించకుండా తనకు ఇవ్వాలన్న ఏడు వేలూ ఏగల్లంతూ లేకుండా సమర్పించిన ప్రకాశం అతని దృష్టిలో చాలా మంచివాడుగానూ, అభినందనీయుడుగానే కనపడ్డాడు.

ద్రవ్యవిషయంలో తా నంత సులభంగా బైటపడగల ననుకోలేదు ప్రకాశం. సరే, అదృష్టవశాత్తు చిక్కు సులువుగానే విడిపోయింది. కాని త నిప్పుడు చెయ్యవలసిన పనేమిటి? తనూ, తనకంటె ఒక ఏడాది చిన్న సవతితల్లీ, మూడేళ్ల ఆమెకొడుకూ, డెబ్బై ఏళ్ల నాయనమ్మాకూడా చేతిలో మిగిలిన యీ వెయ్యి రూపాయలతో బ్రతకడ మెలా సాధ్యమవుతుంది అన్నదే అతని తీవ్రాలోచన. తానే ఏదోవిధంగా కొంత సొమ్ము ఆర్జించి తనమీద ఆధారపడిన యీ నలుగుర్నీ పోషించాలన్న విషయంమాత్రం నిస్సందేహంగా, విస్పష్టంగా కనిపిస్తున్నది. అయితే, ఉద్యోగం వచ్చే దారేదీ? ఆరంభించి వదిలేసిన యింటర్మీడియేటు క్వాలిఫికేషనుతో ఉద్యోగాశామృగతృష్ణల్ని పరామర్శిస్తూ ఒక ఆర్నెల్లు గడిపేడు. అతని ఆశావల్లి మళ్లీ చిగిర్చే సూచన లేమీ లేని సమయంలో తన తండ్రితో బాగా పరిచయం ఉన్న ఒక స్కూళ్ల యిన్‌స్పెక్టరుగారి అనుగ్రహంవల్ల ట్రెయినింగుకాలేజీలో సీటు దొరకడమూ, తాను ప్యాసయివచ్చిన ఒక సంవత్సరంలోనే ఒక పల్లెటూళ్లో మేష్టరుపని దొరకడమూ సంభవించేయి.

* * *

సుందరికి తండ్రిని పోగొట్టుకొనే దురదృష్టం పసినాడే సంభవించింది. కాని మేనమామగారింట్లో తల్లీ, తనూ కలిసేఉండడమువల్ల ఆమె కంత దిగు లనిపించలేదు. మేనమామగారి పిల్లలతో కలిసి ఆడుకుంటూ చదువుకుంటూ గడపిన ఆమెబాల్యంలో ప్రత్యేకం విచారించవలసిన అవసరం ఆమె కేదీ కలగలే దనే చెప్పాలి. కాని మొదట్లో తనకు మామయ్యపిల్లల కున్నకంటె చాలా తక్కువ బట్టలుండడానికీ, రెండు మార్లు పోయినతరువాత మూడవసంవత్సరం నానా అవస్థలూ పడి మేనమామకొడుకు పరీక్షలో నెగ్గేడన్న విషయం తెలిసిననాడు మేనమామా అత్తా చూపిన ఉత్సాహంలో లవలేశమున్నా తాను పరీక్ష స్కూలులోకల్లా ఫస్టుగా ప్యాసయి మంచి బహుమతులూ దీవనలూ ఆర్జించుకున్నరోజున చూపించక పోడమేకాకుండా 'ఆఁ. ఈ తెలివి తేటలు నిలిచినప్పుడు

చూద్దాములే! ఇలాటివాళ్లకే పెద్దవుతున్నకొద్దీ విరగబాటూ, పెడసరమూ జాస్తీ' అని మేనమామ ధాటీగా అనడమూ ఆమె కప్పుడేమీ అర్థమయేవి కావు. పాపం! ఆమె తానేమో చాలా తప్పుపని చేసినట్లు హడిలిపోయి తల్లిఒళ్లో కూర్చొని ఏడవడం మొదలు పెట్టింది. 'కాదమ్మా. నీమంచికోసమే మామయ్య అలాగు పెంకితనం నేర్చుకోగూడ దన్నాడు' అన్న తల్లి నరసమ్మ ఓదార్పుకూడా ఆమెను సంతోషపరచ లేకపోయింది. పోనీ, యీమారు పరీక్షలో మామయ్య కూతురు మహలక్ష్మికంటె పాడుగా రా స్తే? అసలు చదువే మానేస్తే? ఏమో, పంతులమ్మ ఏమనుకుంటుం దో?—యివే ఆమెఆలోచనలు.

ఆ పదమూడేళ్ల వచ్చీరాని జ్ఞానంలో ఆమెకు తన పెళ్లి విషయంలో తల్లి పడుతున్న ఆందోళనకి అట్టే కారణం కనిపించేది కాదు. అయినా మామయ్యకి మాత్రం తెలిదా? అతనికి పదేపదే చెప్పడ మెందుకు? ఇంతకూ తనకంటె చిన్నయితేమాత్రం మామయ్య కూతురు మహలక్ష్మికే ఎందుకు ముందు పెళ్లికా కూడదు? మరి అమ్మ కెందు కీగాభరా? పెళ్లిలో ఉండే మంచిసెబ్బరలు సంపూర్ణంగా తెలియక పోయినా ఆమెకీ ఏవో కొన్ని ఉద్దేశా లుండేవి. ఎవరో నలభైఅయిదేళ్ల వెంకన్న పంతులుగారిని పెళ్లి చూపులకి తీసుకొచ్చి ఎదుటికి రమ్మన్న మామయ్య మీదా, వెళ్లమని వెనకనుంచి నెట్టిన అత్తమీదా ఎందు కంత కోపం వచ్చిందో తనకే తెలీదు. ఇన్నాళ్లుగా మామయ్య లక్ష్మిపెళ్లికోసం తంటాలుపడు తున్నాడుకదా—తన కంత నచ్చితే లక్ష్మినే ఎందు కాయన కిచ్చి పెళ్లిచెయ్యకూడదూ? తల్లి నరసమ్మ గట్టిగా, ఆ వెంకన్నపంతులకి వినబడేలాగే 'ఒక్కే అన్నయ్యా! తాపీగా ఆలోచించి రాస్తామని చెప్పు' మన్నప్పుడు ఆమెమీద కలిగిన గౌరవభావమూ, మామయ్యకు తల్లిమీద వచ్చిన ఆగ్రహమూ, తల్లి నిరాహారవ్రతమూ ఆమెహృదయఫలకంమీద నిశ్చలమైన శిలాక్షరా లైనాయి.

మరొక ఏడాదిలో తల్లి చచ్చిపోవడంతో ఆమెలో ఉండే ఆనందమూ, ఆలోచనాశక్తికూడా నశించే యనే అనవచ్చు.

తల్లి నరసమ్మేగాని బ్రతికిఉంటే యీ నలభై ఐదేళ్ల సదాశివరావుగారికి తనను ఇచ్చి మేనమామ పెళ్లి చెయ్యగలిగేవాడేనా? తనకు అంత త్వరగా పెళ్లి చెయ్యడం తనమీది అభిమానంచేత మాత్రం కాదని ఆమెకు నిశ్చయంగా తెలుసు. కాని పెళ్లి కాకుండా తాను ప్రక్కను ఉండగా మామయ్య కూతురు లక్ష్మికి సరియైన సంబంధం వచ్చే అవకాశాలు లేకపోవడమే మామయ్య అకారణాదృతికి కారణమని ఆమెకు చూచాయగా తెలియకపోలేదు. నిరోధించినా లాభం లేదన్న నిరుత్సాహమూ, తా నుండడంవల్లనే ఎంతో శ్రమపడుతున్నా నసే అత్తనుండి సాధ్యమైనంత త్వరలో విముక్తి పొందవచ్చు ననే ఆశాలేశమూ ఆమెలో వివాహభయాన్ని కాస్త తగ్గించేయి.

మేనమామతో వివాదంఏదైనావచ్చినప్పుడు తల్లి "మాకేం ధర్మంగాపెట్టక్కర్లేదు. అంత తిండికూడా గతి కదుక్కుపోలేదు." అన్నమాటలూ, తనతోకూడా ప్రత్యేకంగా తమ ఆస్తి ఏదోకొంత ఉన్నట్లూ, దాని మీద వచ్చే వడ్డీమాత్రమే తాము అనుభవిస్తూ ఉండటంవల్ల తన వివాహానికి డబ్బులో చెన్నదూ రాదనడం ఆమెకు మరుపురాలేదు. కాని మేనమామతో ఆవూసెత్తడ మెలాగు? ఇంతకూ డబ్బు ఉండి తన కేం ప్రయోజనం లేదు కదా? ఈ సదాశివరావుగారి చేతులో పోస్తేమాత్రం తనకు వచ్చే ఫలిత మేమిటి? ఆయనకు తను భార్యేకదూ కావలసినది— ఆయన ఎలాగూ ధనికుడే! పాపం, మామయ్యే పిల్లలవాడు! ఇంతకూ ఆవిషయంలో తాను చేయగలిగింది గాని, మాట్లాడగలిగింది గాని ఏముంది?

* * *

తన భర్త జీవించి ఉన్నప్పుడు సెలవులకిమాత్రం అప్పుడప్పుడు వచ్చేవాడు ప్రకాశం. కాని అన్నాళ్లు తాతగారింట్లో ఉండి చదువుకుంటూవచ్చిన ప్రకాశం మీది ప్రేమచేత అతనికి కావలసిన సర్వమూ అత్తగారే చూసుకునేది. అతనుగూడా తప్పనిసరి అయినప్పుడు ఏదో గాలిలో కోరుకుంటున్నట్టు "మంచినీళ్లు కావాలి—నాయనమ్మ లేదు కాబోలు. నేను వేగిరం భోంచేసి వెళ్లాలి"అన్న మాటలూ, వెళ్లేటప్పుడు "వెళ్లొస్తాను పిన్నీ!" అన్నమాటా తప్పితే తనతో మరేమీ

మాట్లాడక పోవడం ఆమెకు మొదట్లో చాలా ఆశ్చర్యంగానే ఉండేది.

అసలు తను వొడ్డిస్తేనే సరిగా తినేట ట్టుండే వాడు కాడు ప్రకాశం. ఇంట్లో ఉన్నంత సేపూ అతనేమీ మాట్లాడకుండా కూర్చోడం, ఉబుసుపోక ఏమేనా మాట్లాడితే ఎందు కీ బాధ అన్నట్టు ఏవో సమాధానా లిచ్చి వెళ్లిపోడం ఆమె కేమీ అర్థమయేవి కావు మొదట్లో. అయితే తాను వినలే దనుకొని ఇరుగు పొరుగువారితో అత్తగారు "ఆఁ! మనవడిసంగతా? మరొక్క సెల్లా ల్లిక్క డుంటే మా బాగున్నట్టే. ఇంతకీ నేను కాలం మళ్లినదాన్ని. సవితితల్లి సవితి తల్లే కదా ?" అన్న మాటలవల్ల అతని ప్రవర్తన కొంత వరకూ ఆమెకు అర్థమయింది. కాని వా ళ్లనుకుంటున్నట్టు అతన్నిచూస్తే అసహ్యమూ, ఆగ్రహమూ మొదలైన వేవీ తనకు కలగకపోవడమే కాకుండా ఏవో చెప్పలేని అభిమానమూ, ఆత్మీయు డనే నమ్మకమూ మాత్రమే ఆమెలో కుదిరేయి. తను అతన్ని ఎంతమాత్రమూ ద్వేషించలే దన్న సంగతి అతనికి తెలియజేయా లని ఆమెకు చాలా ఆసక్తి ఉండేది. కాని సందర్భాసందర్భాలు లేకుండా కూడా సవతితల్లి ప్రేమను గూర్చీ, తల్లి లేని పిల్లల అవస్థలను గురించీ అత్తగారు మనవడితో చేసే ప్రసంగాలు అతనిలో ఎట్టి మార్పునూ కలుగనిచ్చేవి కావు.

* * *

సుందరికి తన పెళ్లినాడు ఎంత ఆనందం కలిగిందో సదాశివరావు గారు పోయిన నాడు కూడా అంతే దుఃఖం కలిగింది. ఎవరో బంధువులు చచ్చిపోయినప్పటికంటె అధికంగా ఆమెను విషాదచ్ఛాయలు ఏవీ ఆక్రమించుకోలేదు. ఇంతకూ ఆయన పరిచయమే ఆమెకు తక్కువగా ఉండేది. ఎన్నో వ్యాపకా లున్న మనిషవడంచేత రోజులో ఎక్కువభాగం ఇంటివద్ద ఉండేవాడు కాడు. ఉన్న కాస్తసేపూ ఏవో వేళ్లుమడిచి లెక్కలుపెట్టుకుంటూనో, నిద్రపోతూనో కాలం గడిపేవాడు. ఎక్కువ మాటలాడడమే ఆయనస్వభావం కానట్టుగా తోచిం దామెకు. అందువల్లనే సుందరి ప్రకాశంతోనైనా ఏదో మాట్లాడడానికి ఆత్రత చూపేది.

అయితే భర్తవల్ల ఆమెకు ఎట్టి సౌఖ్యమూ దొరకలే దనడానికి వీల్లేదు. సాధింపులకి లోటు లేకుండా అత్తగారున్నా, మామయ్యగారింటిలోనే తానుంటే తిండికీ బట్టకూకూడా పడవలసిన కష్టమేమీ ఇక్కడ లేదు. అంతే కాకుండా తన వుపయోగం కోసం సెంట్లూ, వాసననూనెలూ, పువ్వులూ అప్పుడప్పుడు తెస్తూ తన సరదాలను స్వావకాశంలో కొంత వరకూ గుర్తించిన ఆయనప్రవర్తన ఆమెలో ఆయనపట్ల ఒకవిధమైన గౌరవభావాన్ని కలిగించడంమాత్రం వాస్తవం.

నెత్తీ నోరూ బాదుకొని ఏడవకపోడం సరి కదా లాంఛనంగాకూడా సరీగా ఆమె ఏడవకపోడం చాలారకాల విమర్శనలకు ఆధారభూత మయింది. అయితే ఆవిమర్శనాంకూరాలు స్వయంభూతములైతే ఆమె విచారించేదేమోగాని, అత్తగారి అసమానమైన కృషే వాటికి మూలకారణ మని గ్రహించడంచేత ఆమె అణుమాత్రమేనా జంకినట్టు కనిపించలేదు. కాని తాను నిత్యమూ ఏడవకపోడ మనేది చనిపోయిన తన కొడుకు సదాశివరావు కేదో తీరని అవమాన మని అత్తగా రనుకోడం ఆమెకు చాలా వింతగానే ఉండేది. "ఒకవేళ తా నిప్పు డహోరజను లాక్రందిస్తేమాత్రం గతించిన తన భర్త కేమేనా లాభ ముంటుందా? పోనీ ఆయనకు కాకపోయినా అంతగా ఆరాటపడుతున్న తన అత్తగారి కేమైనా లాభిస్తుందా?" అని చాలా నిశితంగా ఆలోచించడంమాత్రమే ఆమె చేయగలిగింది.

సుబ్బమ్మగారికి కొడుకుచావుకు యీ కొత్తగా వచ్చిన కోడలు యిల్లుతొక్కిన వేళలోని దోషమే కారణ మని ఉన్న నమ్మకాన్ని ఆమె యిరుగుపొరుగు వారితో వెల్లడించకుండా ఉండలేకపోయేది. కాని తనకు వచ్చిన యీ ఆగ్రహాన్ని గ్రహించికూడా కోడలు తనతో వివాదపడకపోడము ఆమెకు మరీ దుర్భరమైపోయింది. ఆమెకాగ్రామంలోని ఒకటిరెండు బ్రాహ్మణకుటుంబాలతో పరిచయం అతిత్వరలో అవడానికి కోడలిమీది ఆగ్రహం చాలా సాయపడిం దనవచ్చు. మొదటివారంలోనే పూర్వపు తమకుటుంబ పరిస్థితులూ, భర్తపాండిత్యప్రతిభా, తన తండ్రిధర్మబుద్ధీ, తల్లి ఆచారాధిక్యమూ మొదలైన విషయా లన్నీ సమ

గ్రంగా విశదీకరించడం ఒక దృఢమైన పరిచయ బంధాన్ని సృజించింది. రెండవ వారంలో ఆ యింటి వారు పరస్పర వైషమ్యాలను తనతో ప్రత్యేకంగా చెప్పుకోవలసినంత సన్నిహితురాలవడం సంభవించింది. దాంతో తన చిన్ననాడు అత్తగారు పెట్టే అతిలోకమైన ఖాయిదా, భర్త తనమీద వ్యర్థంగా పడిన అనుమానాలు, తత్ఫలితంగా తాను పడిన కష్టాలూ, తన మహత్తరసహనశక్తీ మొదలయిన విషయాలతో ఆరంభించిన తన మొదటికోడలి సుగుణవర్ణనక్రమంలో ఔన్నత్యనిరూపణకి ఉదాహరించిన రెండవకోడలు సుందరిలోని లోపాలే ఆపయిని వారి నిరంతర ప్రాసంగిక విషయాలుగా పరిణమించేయి.

* * *

సుందరికి అక్కడి స్త్రీలతో పరిచయం కలుగజేసుకోవడం అంత అవుసరంగా కనిపించలేదు. అంతే కాదు, యీషదసహ్యంకూడా కలిగిందనీ అనాలి. అందుకు కారణం అత్తగారికీ వారికీ గల అతిపరిచయమే కాకుండా వారి సంభాషణావైఖరికూడా. తాను అతిసామాన్యంగా ఉన్న సంగతి గమనించినా ఏదో ఓదార్చుతున్నట్టు "అట్టే విచారించకమ్మా. ఇంతకీ నువ్వుమాత్రం అతనేం చచ్చిపోవాలని కోరేవా? అయినా ఆనుసలమ్మఖర్మానికి మన మేం చేస్తాం? పాపం, హాయిగా ఉన్న ఒక్కకొడుకుచేతిమీదా పోయే అదృష్టం లేదు." అని కష్టం యావత్తూ సుబ్బమ్మకే వచ్చినట్టూ, అందుకు కారణం ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానైనా తానే అన్నట్టూ, అన్న మాటలు ఆమెకు ఉత్తరమియ్యవలసినంత యోగ్యములుగా తోచేవి కావు. వారితో తనలోని దోషాలు సంపూర్ణంగా అర్థమయీకూడా అభిమానం కొద్దీ సర్దుకున్నట్టు "పాపం, మాకోడలు మొహంచూస్తేనే నాకడుపు తరుక్కుపోతుంది. వాడు పోయినదగ్గర్నించి యిదే వరస. మూడేళ్లయినా ఒక్కమాటాడదు; వీధి గుమ్మంలోకేనా రాదు; ఇంత తిని శుబ్భరమైన బట్ట కట్టుగోదు. నేను మొత్తిపెడితే యిప్పు డింకా కొంత నయం. ఎప్పుడూ ఏపురాణమో-అవేవో ఆపేర్లు నాకు తెలీవు-అవి చదువుతూ కూర్చుంటుంది. ఏదో జవపోయినా పుట్టెడు దుఃఖంలో ఉన్నదాన్నెందుకు శ్రమపెట్టాలని నేనే రెండుపూట్లా వార్చేస్తాను." అని అనడంకంటె తన్ను బాహాటంగా తిడితే ఎంతో బాగుండుననిపించింది సుందరికి. సరే, వారి ఆనందానికి నేనెందుకు భంగం కలిగించాలి? వారలా అనుకున్నంతమాత్రాన నాకు వచ్చే నష్టమేమీ లేదుకదా అని తన్ను తానే సమాధానపరుచుకుంది సుందరి.

ఆమె ఏవో తప్పనిసరి అయిన గృహకృత్యాలు నిర్వహించేకొద్దికాలం మినహా, ఎల్లప్పుడూ సదాశివరావుగారి సంపాదనలో మిగిలిన రెండు బీరువాల పుస్తకాలూ చదివినవే మళ్లీ మళ్లీ చదవటంతోనే కాలక్షేపం చేసేది. చిన్ననాటి చదువు అట్టే లేకపోయినా సడలని పట్టుదలతో చదివి చదివి మొదట్లో దురవగాహములుగా ఉండిన గ్రంథాలను సైతం క్రమేణ అర్థంచేసుకోడానికి ప్రయత్నం చేసి చాలావరకు సాఫల్యము పొందిందనే అనవచ్చు. మొదట్లో ఆమెకు విషాదాంత గ్రంథాలను చదవడమంటే ఒక విధమయిన భయం వేసేది. అందుచేత ప్రతీపుస్తకమూ తుదిమొదలు చదివి సుఖాంతమయితేనే గాని చదివేది కాదు. చదివినవే చర్విత చర్వణంగా చదవడం చికాకు వేసి, ఆమె అదివరకు చదవని విషాదాంతములైన గ్రంథాలనుకూడా చదవడం మొదలుపెట్టింది. మొదటిమారు 'టాగూరుగారి 'ప్రాయశ్చిత్తము' చదివినప్పుడు సగంచదివేసరికే ఆమెకన్నీళ్లతో పుస్తకంతడిసిపోయింది. ఒక మహత్తరమైన గ్రంథంలో అంతప్రతిభ ఉన్నట్టు ఆమె గ్రహించడానికి అదే మొదలు. కథలో ఇకపైన ఏమవుతుందో అన్న విషయాన్ని పూర్వంవలె ఆలోచించడానికి ఆమెలో ఉత్సాహమే లేదిప్పుడు. తనకూ, ఆయా పాత్రలకూ ఏదో ఒక సన్నిహితమయిన సంబంధం ఉన్నట్లుగా ఆమె భావించగలదిప్పుడు. తానుకూడా పుస్తకంలోని వ్యక్తులతో సమంగా సుఖదుఃఖాలు అనుభవిస్తున్నట్టే— కాదు, తననూ వారినీ వేరుచేసే పదార్థం ఏమీ లేదనే ఆమె అనుకోగలిగేది. సగంలో చదవడం నిలిపి మళ్ల మొదటినుండీ చదవడం ఆరంభించింది. ఇదివఱకు తాను ఏపుస్తకం కూడా మొదలుపెట్టిన ఒకటి రెండు రోజులకంటె ఎక్కువచదువలేదు. కానియీపుస్తకంచదవడం సరీగా నెల్లాళ్లయిం దన్న సంగతి ఆమెకే ఒకవిధమయిన

ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ కూడా కలిగించింది. ఒక పేరా చదివి అందులో ఉన్న విషయాన్ని గురించి ఆలోచన మొదలెడితే ఆపూటంతా తనకు తెలియకుండానే గడిచిపోవడం పునర్విమర్శనా దృష్టిలో ఆమెకొక నూతనోత్సాహాన్ని ప్రసాదించింది. ఇదివరకువలె యీ వున్న కొంచెము పుస్తకాలూ చదివేసేక ఏమిటి చెయ్యడం– ఎలాగు ఊసుపోతుంది అన్న ఆలోచనే ఆమెలో లేదిప్పుడు. తాను చదివిన పుస్తకాల్లోని ప్రతివ్యక్తీ, తన ఎదుట నిలిచి మాటాడుతున్నట్టే, తన కష్టసుఖాలు వారుకూడా పంచుకుంటున్నట్టే ఆమె ఊహాపథంలో నిత్యమూ ద్యోతమానమయేది.

* * *

ప్రకాశానికి ఆవూర్లో పనిఅయేసరికి అతని (సవతి) తమ్ముడు రాముకు నాలుగో ఏడు వచ్చింది. రామువిషయంలోమాత్రం సుబ్బమ్మగారికి సుందరిమీద వున్న దుర్భావము లేకపోవడమేకాక ప్రకాశంమీద ఉన్నకంటే ఎక్కువ అభిమానం ఉండడానికి కారణం లేకపోలేదు. ప్రకాశం పుట్టిన ఆర్నెల్లకే తనకు వైధవ్యము ప్రాప్తించడంలోని అతని జన్మనక్షత్రదోషము తన మొదటికోడలు జానకియొక్క మనఃపూర్వకయత్నఫలితమే ననీ, అందువల్ల ప్రకాశాన్ని తాను ఆదృతితో చూడడం చాలా దోషమనినీ ఆమెకు దృఢమైన విశ్వాసం ఉండేది. కాని జానకి చావుతో ఆమెమీదా, ప్రకాశంమీదా ఆమెకు గల వైషమ్యం యావత్తూ అంతరించిపోయిందికాని తల్లి లేని పిల్లడవడంవల్ల, చదువుకుకూడా సదుపాయంగా ఉంటుందని తాతగారు తమ యింట్లోనే ప్రకాశాన్ని ఎక్కువ వుంచుగోడంచేత సుబ్బమ్మగారికి ప్రకాశం యెడల తన నవీనాసమానాదృతిని చూపించడానికి అట్టే అవకాశం కలిగేది కాదు. అయితే ఆ కారణంచేత తాను ఎంతగా పరితపిస్తున్నదో ఇరుగుపొరుగువారితో విశదీకరించడంతో ఆమె కొంతవరకు తన్ను తాను ఓదార్చుకోగలిగేది. కాని రాము అంటే మొదణ్ణించీ ఆమెకున్న అభిమానం అనుపమానం. దానికితోడు కోడలు వట్టి నిర్లక్ష్యంమనిషని తనకు మొదటినుండీ వున్న నమ్మకంతో తానైనా సరీగా చూడకపోతే తన కొడుకుకొడుకు ఎందుకూ కొఱగానివాడైపోతాడేమో అన్న భయంతో సర్వదా తన శక్తికి అతిగా కూడా శ్రమపడేది. రామునిగురించి, అందులో తల్లిదగ్గిర పాలు తాగడంకొంచెం ఎడపెట్టినదగ్గరనుంచీ ఆమె తన సర్వస్వమూ వాడేననీ, వాడు పెద్దయేక యే కలెక్టరన్నా అవుతాడనీ ఆమె నిస్సందేహంగా నమ్మగలిగేది. ఆమెనమ్మకంలోని నిశితత్వం ఎంతవరకూ వెళ్లిందంటే ఒకమారు బాతాఖానీలో "ఏమండీ, మీమనవడికి ఎంత కట్నమిస్తే మాపార్వతిని చేసుగుంటా"రని పొరుగింటి బుచ్చెమ్మగారడిగితే "అబ్బో, వాడెక్కడా! ముందు కలెక్టరీ ప్యాసుకాందే పెళ్లే చేసుగోడు. అప్పుడేనా వాడికి ఏ జమీందారుగారి కూతురోగాని నచ్చుతుందా?" అని ఆమె అన్నమాటలు విన్నవారికి హాస్యానికి అంటున్నట్టు తోచినా ఆమెమాత్రం హృదయపూర్వకంగా అన్నవే!

సుందరికి తన కొడుకుమీద తనకంటే ఎక్కువ అభిమానం ఉన్నట్లు అత్తగారు ప్రవర్తించడం మొదట్లో కొంత కంటకంగానే ఉండేది. తా నంత ప్రపంచజ్ఞానం లేని చిన్నపిల్ల కాదే - మాటిమాటికీ "నూనె రాసేవా? ఒళ్లు తుడిచేవా? పాలిచ్చేవా" అనో, "ఎండాకాలం పెద్దవాళ్లమే ఉడికిపోతున్నాం, కొంచెంసేపు మంచంమీ దొద్దు; ఉయ్యాల్లో పడుకోబెడితే నేనైనా ఊచుతాను" అనో ఏమీ తెలీనివాళ్లకి చెప్పినట్టు చెప్పడమే కాకుండా ఇరుగుపొరుగువారితో "పాపం, మాకోడలు కేమీ తెలీదు. పిల్లడేడిస్తే నేచెప్పేదాకా పాలివ్వాలనికూడా తెలీదు. అయినా యీకాలంవాళ్లంతా యింతే గాబోలు!" అని ఆమె పదేపదే అనడం సుందరికి చాలా సిగ్గుగా ఉండేది. అయినా అత్తగారి మాటకు తానేమాత్రం మారాడినా ప్రశాంతమయంగా వున్న గృహసీమ ఎంత భయానకసంగ్రామరంగంగా మారుతుందో ఆమెకు పూర్తిగా అవగతమవడంవల్ల ప్రత్యుత్తరం ఇయ్యకుండా, వ్యతిరేకంగా ప్రవర్తించకుండానే రామాన్ని మూడేళ్లు పెంచింది. రాముకి కొంచెం మాటలు వస్తున్న సమయంలోనే భర్త గతించడంతో ఆమెకు తననీ, కొడుకునీ సన్నిహితుల్ని చేసే బంధం ఏదో సడలిపోయిన ట్టనిపించింది. అంతేకాదు.

సదాశివరావుగారు తన మంచిచెడ్డలూ ఆస్తీ అప్పూ మొదలయినవి తనతో తీసుకొనిపోకుండా ఎలా అయితే వదిలేసేడో అలాగే రాముని కూడా వదిలేసేడని ఆమె నమ్మకం. అప్పటినుండీ అత్తగారు రామునిగురించి తీసుగొనే శ్రద్ధ సుందరికి కొంతవరకు ముదావహంగానే పరిణమించింది. వాడుకూడా పెద్దవుతున్న కొద్దీ నాయనమ్మవద్దనే ఎక్కువ చనువుగా ఉండేవాడు. తనకు ఏది కావలసివచ్చినా నాయనమ్మనే అడిగేవాడు. ఇవ్వనప్పుడు సామాన్యంగా చిన్నపిల్లలు చేసే పెంకితనం అంతా క్రమం తప్పకుండా చేసేవాడు. కొంచెంవినిపించాలనే "అలాపుస్తకం పట్టుక్కూర్చోక పోతే వాణ్ణోమారు తియ్యకూడదూ? ముసలిముండని ఎంతని చస్తాను" అన్న మాటలు వినిపించేవే కావు సుందరికి. కాని మనవడు తన్నలా చికాకుపరచడమే ఆవిడఅభిమతం. రెండురోజులు కొంచెం జ్వరం తగిత్తే "అయ్యో! రోజల్లా బంతిలా ఆడుకొనేవాడమ్మా! 'నానమ్మా,ముట్టుకొనేధా పంచదా రిస్తావా' అనేవాడమ్మా!" అని బహుధా వాపోయేది.

సుందరి ఏదో నిర్దేశితకృత్యంలాగే రాముకి తలదువ్వడం, మాసిన బట్టలు మార్చి కొత్త బట్టలు తొడగడం మొదలయిన పనులు చేసేది. రాముకూడా ఏమీ మాటాడకుండా తల్లిదగ్గ రున్నంతసేపూ చాలా గంభీరంగానే ఉండేవాడు. అయితే ఆగాంభీర్యం ఒక్క తల్లిదగ్గ రున్నప్పుడే. మిగతావారందరివద్దా-అందులోనూ నాయనమ్మవద్ద చాలా చలాకీగానే ఉండేవాడు. కాని అగాధవిషాదావృతమయిన తల్లి ముఖం చూసేసరికల్లా ఏదో ఒక చెప్పలేని భయగౌరవ సమ్మిళితభావం కలిగేది ఆ నాలుగేళ్ల అమాయక హృదయంలో. అందువల్లనే ఆమె పిలిచేసరికి తల దువ్వించుకుందికి వచ్చేవాడు. అంతేకాదు. నాయనమ్మవద్ద మారాం చేస్తూన్నప్పుడు "ఏమిటి రామం! ఆపెంకితనం? ఇలా నాదగ్గరకు రా!" అని పక్కగదిలోనుండి ఆజ్ఞాసూచకమైన స్వరం వినిపించడంతో అంత పెంకితనం చేస్తున్నవాడూ మంత్రముగ్ధుల్లాగు ఊరుకొని దగ్గరకు మెల్లిగా వెళ్లి "ఏమీ లేదమ్మా. నాకేమీ అక్కరలేదు" అని, చిరునవ్వు నవ్వే తల్లిముఖం చూసి తన కాంక్షాప్రాప్తి అయినప్పటికంటె అధికమైన ఆనందంతో ఆడుకుందికి వెళ్లిపోయేవాడు. కాని యీవిషయంలోమాత్రం సుబ్బమ్మగారికి మనవడిమీద అమితమైన కోపం వచ్చినా మళ్లీ ఒక్కగంటలో "నాయనమ్మా, బెల్లంముక్కియ్యవూ" అంటూ దగ్గరకు వచ్చిన మనమణ్ణి చూస్తేఆకోపమంతా అదృశ్యమైపోయేది. కాని తప్పనిసరిగా "చూడమ్మా! నీకొడుకు కిక్కడ ఇల్లుతీసి పందిలివేసేస్తున్నా"డని కోడలుతో ఫిర్యాదు చేయవలిసిరావడం చాలా చిన్నతనంగానే తోచేది.

సుందరి తన రాముమీద సహజంగా ఉండవలసినంత ప్రేమ మాపించలేని మాట వాస్తవమే. అసలు ఆమె సదాశివరావుగారిని మనస్ఫూర్తిగా ప్రేమించలేకపోడమే రాముని చాలా సామాన్యంగా చూడడానికి కారణమేమో? సదాశివరావుగారివలనఆమెక్కుకలిగిన ఆనందం దెబ్బతగిలితే కలిగే నొప్పిలాగే అయాచితంగానూ, అతిసాధారణంగానూ కాకుండా అనవసరంగా అసమయంలో వచ్చిన ఆనందంవలె ఉండేది. తన తిండికీ గుడ్డకూ ఏవిధమైన లోపం రానీకుండా, మిగతావిషయాల్లోకూడా అట్టే నీరసంగా చూడని సదాశివరావుగారి ఔదార్యానికి ప్రతిఫలంగా తాను చేయగలిగినదల్లా అతని ఆనందాన్ని తాను నిరోధించకపోవడమే అని ఆమె మనసా విశ్వసించగలిగేది. అంతేకాని ఆమె అవివాహితగా ఉన్నప్పుడు తన తల్లికంటెకూడా సన్నిహితుడూ, తన హృదయగ్రంథంలోని ప్రతిపత్రమూవినడానికి యోగ్యుడూ ఐన మిత్రుడు దొరుకుతాడని ఆమె కన్న వెఱ్ఱికలలలోని ఆమె భర్తకూ సదాశివరావుగారికీ ఏ అంశములోనూ సాదృశ్యము లేదు. ఆమెకు తనకు కాబోయే భర్త అంటే తనకంటే ఏ అయిదారేళ్లో వయసులో పెద్దవున్న యువకుడే మానసికంగా గోచరించేవాడుగాని బ్రతికివుంటే తన తండ్రితో సమానమైన యీడు గల సదాశివరావుగారివంటి మనిషిప్రక్కను తాను పెండ్లిపీటల మీద కూర్చోవలసివస్తుం దని అంత నైరాశ్యంలోనూ ఆమె ఊహించలేకపోయేది. అందువల్లనే మొదట్లో ఆమెకు సదాశివరావుగారు తన ద్వారా నెరవేర్చుకున్న కృషికి ఫలితంగామాత్రమే రాముతోచడమూ,

అతనిని 'నావాడు' అన్న దృష్టితో చూడలేకపోడమూ సంభవించేయి.

* * *

తన పెళ్లిలో ప్రకాశాన్ని చూచిన దగ్గరనుండీ కూడా సుందరికి అతనంటే ఒక అసామాన్యమైన అనురాగం కలిగింది. తనకంటె కొంచెం (ఒకయేడాది) పెద్దయినా అత నామెకు తనకంటె చాలా చిన్నవాడుగా కనిపించేడు. అందుకు కారణం మామయ్యగారింట్లో అత్తఅదుపుఆజ్ఞలకూ, ఆమెపిల్లల యీసడింపులకూ లోబడి ఉండడంవల్ల ఆచిన్నతనంలోనే తనచుట్టూ ఉండే మనఃప్రవృత్తులను అర్థంచేసుకొని వాటికి తగినట్టు మెలగడానికి చేసిన ప్రయత్నానికి ఫలితంగా తనవయస్సు తానే మరిచిపోయే స్థితిలోకి రావడమే. తనకేగాని ఒక తమ్ముడుంటే అలాగే ఉండేవాడేమోనని ఆమె అనుమానం. అందుచేతనే తను అత్తవారింటికి వచ్చిన కొత్తలో శలవులకు ప్రకాశం వస్తాడంటే ఏమో తనకే తెలియని ఆనందం కలిగి నెల్లాళ్లకు ముందునుండీ రోజులు లెక్కబెట్టడం మొదలుపెట్టింది. తన ఉత్సాహాన్ని బైటపెట్టే అవకాశం మరేమీ లేకపోడంవల్ల రుసరుసలాడుతున్నా అత్తగారినే మళ్లీమళ్లీ "అత్తా, ఇంకా ఎన్నాళ్లకు ప్రకాశం వస్తాడండీ" అని మాటిమాటికీ అడిగేది. గాని ఆమెమాత్రం "ఏదో ఒస్తాడు. ఒస్తే చూసి సంతోషించడానికి తల్లి లేదుకదా!" అని నిరుత్సాహంగా అన్న మాటలు ఆమె సహజధోరణిగానే సుందరికి తోచేవి; కాని తాను అతనికి సవతితల్లి అవడంచేత సహజంగా అతనిమీద తనకి యీర్ష్యగా ఉంటుందనీ, అందువల్లనే అయ్యో! ప్రకాశం వచ్చి తన భర్త సొమ్ము తినిపోతాడే అన్న భయంతో అడుగుతున్నాననీ ఆమెవాక్యాల్లో ఉన్న అంతరార్థం తరువాత ఎన్నాళ్లకోగాని ఆమెకు అర్థంకాలేదు. అతనేదో పెద్ద కాలేజీలో చదువుతున్నవాడుకదా, తానేదో అమాయికంగా తన స్నేహితురాయళ్లతో మాట్లాడినట్టు మాట్లాడితే అత నేమనుకుంటాడో? ఇంతకీ అతను మాట్లాడే విషయాలు తనకు పూర్తిగా బోధపడవేమో? ఒకవేళ అతను తనతో సరీగా మాట్లాడతాడో మాట్లాడో? యివే ఆమె ఆలోచనలు.

తీరా ప్రకాశం వచ్చాక ఆమెవుత్సాహం చాలా చప్పబడిపోయింది. కొత్త చలాకీగా మాట్లాడ్డమన్న విషయంలో కొడుకుకంటె తండ్రే చాలా నయం అని ఆమె సులువుగా గ్రహించగలిగింది. అంతే కాదు. ప్రకాశానికి తనతోనేకాదు ఎవ్వరితోనూ సరీగా మాట్లాడడం చేతకాదు అన్న విషయంకూడా త్వరలోనే ఆమెకు అవగాహన అయింది. పోనీ అతనికి ఆటలూ మొదలైనవి ఏమైనాసరదా ఏమో అంటే అలాగా కనిపించలేదు. ఏదో తీవ్రమైన విషయం ఆలోచిస్తున్నవాడిలాగు ఎల్లప్పుడూ కూర్చొనేవాడు. లేకపోతే నాయనమ్మవద్ద కూర్చొని అక్కడ తాతగారియింటి విషయాలు కేవలం ఆడపిల్లలాగ వర్ణించే అతని వర్ణనలుచూస్తే సుందరికి అక్కడకూడా ఒక్క అమ్మమ్మ దగ్గర తప్పించి మిగతావాళ్ల దగ్గర అతనికి తగినంత చనువు లేదనీ, తక్కిన పిల్లలందరూ ఒకటీ, తానొక్కడూ ఒకటీ అన్నట్టుగానే ఉండేవాడనీ తోచేది. తాను మంచి పుస్తకాలు చదువుకోగలిగికూడా అతను అతి అమాయికంగా అదివరకు తాను డెబ్బైమార్లు విన్నవే అయినా నాయనమ్మ చెప్పే రాజు కథ, అన్నదానమాహాత్మ్యం కథ చెప్పమని అడగడమూ, సుబ్బమ్మగారు "ఒరే! బుచ్చిబాబూ! ఒక్క నీకు తప్పించి యీ కాలంవాళ్లకి నా కథలు నచ్చే నచ్చ"వని తన అరసికతను సూచిస్తూ ఆమె కథ చెప్పడమూ, అతను ఓపిగ్గా వినడమూ సుందరికి చాలా వింతగానూ, విసుగ్గానూ ఉండేది. మేడమీద ఉండవలసిన స్థితిలో దిగుడుబావిలో ఉన్నట్టుగా కనిపించేది అతని వైఖరి ఆమెకు. ఆమె సందేహం ఏమిటంటే అతను చిన్నప్పటినుండీ యిలాగే అన్ని విషయాల్లోనూ ముభావంగా వుండేవాడా, లేక తల్లి లేకపోవడంవల్లా, తాతగారింటిలో తగిన ఆదరణ చూపించేవా రెవరూ లేకపోవడంచేతా అని. తన ప్రవర్తనలోకూడా మాతృమృతి అనివార్యంగా కొంత మార్పు తెచ్చిపెట్టినా అందువలన తనమీద ఇతరులు చేసే ఒత్తిడి తగ్గినా నిరుత్సాహంగా ఉండడం ఆమెకు ఎంతమాత్రమూ యిష్టం లేదు. కాబట్టే అత్తవారింటికి వచ్చిన కొద్దిరోజుల్లోనే ఆమె నిశ్చింతగా యిరుగుపొరుగువారితో ఏవో ప్రసంగాలు చేస్తూ, అల్లికపనులతోనూ, పుస్తక

పఠనంతోనూ కాలక్షేపం చేయగలిగేది. కాని ప్రకాశాన్ని మరికొంచెం పరిశీలించిన తరువాత కేవలం మాతృమూర్త్యస్తమయమే అతను అంత నిశ్శబ్దంగా వుండడాని క్కారణం కాదని తాను గ్రహించింది. సరియయిన స్నేహితులు దొరకకపోవడంవల్ల అతనిలో సహజంగా వుండే మాంద్యము చాలా విపరీతమయిన స్థితిలోకి వచ్చిం దని ఆమె విశ్వాసం.

ఆమెకు అతని అప్పటి ప్రవర్తన నచ్చకపోయినా అతన్ని మొదట చూచినప్పుడు కలిగిన భాతృభావం మాత్రం ఆమెహృదయంలో చిరస్థాయి అయిపోయింది. అందువల్లనే అలాటి పరిస్థితుల్లోకూడా ఆమె అతనితో ఎక్కువగా కలిసిమెలిసి ఉండడానికి బహుధా ప్రయత్నించేది. కాని అతనుమాత్రం తన ప్రయత్నాలకు చాలా అతీతుడుగా ఉండడము ఆమెకు ఒకవిధమైన పట్టుదల నిచ్చింది. ఆమెకు ప్రకాశాన్ని తనని అర్థం చేసుకొనే స్థితిలోకి తీసుకు రావాలని ఉన్న ఆశయం నెరవేరేవరకూ మరేమీ చేయాలనిపించేదే కాదు. తనతో ఎంత మాట్లాడకపోయినా తానే అవకాశం కల్పించుకొని చాలా చనువుగా "ప్రకాశం, చూసేవా మన పెరట్లో పూచిన మల్లె పువ్వులు. అక్కడ మీవాళ్లింట (తాతగారి ఊళ్లో) ఏమైనా పువ్వులమొక్క లున్నాయా" అనో, "మీకు బళ్లో డ్రాయింగు నేర్పుతారు కదూ? నాకు నాలుగు పువ్వులూ లతలూ రాసిద్దూ. నువ్వు మళ్లీ వచ్చేసరికి గుడ్డమీద కుడతాను" అనో, "మీకాలేజీలో ఆడపిల్లలుకూడా చదువుతున్నారు కదూ! వాళ్లూ మీరూ కలిసే కూర్చుంటారా, వేరు వేరుగా కూర్చుంటారా" అనో ఆమె అడిగే ప్రశ్నలకి జవాబు చెప్పడమంటే విరిగిపోయిన ఆటవస్తువు గురించి తల్లితో చెప్పలేకా, మానలేకా పసిపిల్లడు పడే అవస్థంతా పడి, క్రాస్ఎగ్జామినేషన్ చేస్తున్న వకీలుకు ఎదురుగా నిలబడి నీళ్లునముల్తూ ముద్దాయి చెప్పే జవాబుల్లాగమాత్రమే అతని ప్రత్యుత్తరాలుండేవి. కాని అలాగైనా అతనితో మాట్లాడ్డం అంటే ఆమెకు సరదాగానే ఉండేది. అయితే మధ్యలో పూచీ యావత్తూ నాదే అన్నట్టు అత్తగారు వచ్చి "ఆ! వాడికేం తెలుస్తుంది? అయినా ఆసాదంతా వాడి కెందుకు (చంటినాగమ్మకి)" అని అతనేమో తనకంటె చాలా చిన్నలాగూ, తాను ప్రశ్నించే విషయా లతనికి తెలియకపోవడమే సహజ మన్నట్టూ ధాటీగా అనడమూ, "అవును. అదే యథార్థం" అన్నట్టు ప్రకాశం మౌనం వహించడమూ ఆమెప్రయత్నానికి చాలావరకూ భంగకారులుగానే ఉండేవి.

*　　*　　*　　*

ఆతరువాత సంవత్సరం వచ్చేసరికి ప్రకాశంలో కలిగిన మార్పు ఆమెకు ఎంతో ఆనందా న్నిచ్చింది. అసలు అతని వేషంలోనే చాలా నవీనత గోచరించింది ఆమెకు. పూర్వంవలె ఉందా లేదా అన్నంత చిన్న క్రాపుకాక ఉంగరాలుతిరిగిన పెద్దక్రాపింగు అతని మొగాని కొక కొత్త అందం తెచ్చింది. వస్త్రధారణ విషయంలో సైతము అతనిలో వచ్చిన మార్పు ఏదో మహత్తరపరిణామంగా తోచింది సుందరికి. అతనిలో వచ్చిన మార్పు బాహ్యవేషంతో ఆగిపోలేదు. తాను స్నేహితులిళ్లకు అప్పుడప్పుడు వెళ్లడమూ, తనతో మాట్లాడ్డానికి స్నేహితులు ఇంటికి వచ్చేపాటి ప్రాపంచికజ్ఞానం సంపాదించగలిగేడు.

పూర్వంవలె పిన్ని ఏదేనా తనను ప్రశ్నిస్తే, ఎక్కువ కంగారుపడకుండా జవాబివ్వడమేకాకుండా ఇంకా ఏప్రశ్న లడిగినాసరే సమాధానాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నానన్నట్టు, నోట్సు క్షుణ్ణంగా వల్లెవేసిన విద్యార్థి ప్రశ్నపత్రం పుచ్చుకొనేముందు చూపించే ధీమా యావత్తూ మొగంలో చూపించడము ఆమెకు ఎంతో సంతోషదాయక మయింది.

ఇప్పు డతన్ని మాట్లాడించడానికి పూర్వమంత శ్రమ అక్కరలేకపోవడంవల్ల ఆమె అతనితో ఎన్నో విషయాలు ముచ్చటించడానికి అవకాశం కలిగింది. కాని అతను ప్రశ్న లేకపోతే మాట్లాడలేకపోవడం చేతా, చెప్పే జవాబులుకూడా అవుననో కాదనో చాలా సామాన్యంగా ఉండడంవల్లా అతని దగ్గరనుండి గ్రహింపవలసిన విషయా లట్టే కనపడలే దామెకు. అతనితో మాట్లాడ్డమంటే ఒక విషయంలో వుండే మంచీ చెడ్డాకూడా, ప్రశ్నా జవాబూకూడా చాలా వరకు తానే చెప్పుతూ, జమీందార్ల పిల్లలకి ప్రైవేటు చెప్పే ఉపాధ్యాయుడులాగ తను చెప్పే

విషయం అంత యిష్టంగా వినలేదన్న సంగతి తెలిసీ కూడా ఆమె అతనితో గంటలతరబడిని మాట్లాడేది.

* * * *

అతనికి కథలంటే సరదా అన్న విషయం అదివరకే (అంతకుముందు పర్యాయము వచ్చినప్పుడే) గ్రహించడంచేత అతన్ని ఏమయినా కథలు చెప్పమని కోరేది. కాని ప్రకాశం బడిపుస్తకాల్లో అట్టే కథలుండవనీ, ఉన్నా ఏమీ బాగుండవనీ చాలా నిరుత్సాహంగా అని, పోనీ అంతగా కావలసివస్తే నాయనమ్మ చెప్పిన నాలుగు కథలే చెప్తా నన్నప్పుడు సుందరి నవ్విన చిరునవ్వు అతనికి అర్థము కాలేదు. ఆమెను ఏవైనా కథలు చెప్పమనడానికి ధైర్యం చాలక తటపటాయిస్తున్న సమయంలో సుందరి "అయితేంలే. నే నేవేనా కథలు చెప్పేదా" అని, అతని సమాధానంకోసం అట్టే నిరీక్షించకుండానే కథ చెప్పడం మొదలుపెట్టింది. అదే వారిద్దరి స్నేహలతా ననలెత్తడానికి మొదలు. సౌరభసంపద ననుభవించడంలో మాత్రం వారిద్దరిలో సామరస్యం చాలా తక్కువే అనాలి. ప్రకాశానికి పరీమళప్రభమీద వున్న ఆసక్తి ప్రసూన పాళిమీద లేదు; సుందరికి వల్లీమతల్లిని కుసుమిల్ల జేయడంలో వున్న తన్మయానందము సుమరామణీయకతలోగాని, వాసనాబంధురతలోగాని లేదు.

మొదట్లో ఆమె అరేబియన్ నైట్సులోకథలూ, కాశీమజిలీలలో కథలూ చెప్పి క్రమంగా తాను చదివిన నవలలూ, నాటకాలూకూడా చిన్న కథలుగా మార్చి చెప్పేది. ప్రకాశానికి కథ వింటున్నంతసేపూ బాహ్యప్రపంచం సర్వమూ అంతర్థానంకాగా, కథలో ఉన్న వ్యక్తులతో ఊహాలోక మొకటి నిర్మించుకొనేవాడు. మధ్యలో సుందరి తన వుద్దేశాలూ విమర్శనలూ విశదీకరిస్తూ ఉంటే కొంతసేపు అయిష్టంగా విని, "అయితే ఆ రాజకుమారు డాఖయిదులోంచి ఎల్లా తప్పించుకున్నాడు" అని పేలవంగా ప్రశ్నించేవాడు. ఆమెకూడా సాధ్యమైనంతవరకూ తన విమర్శనలు తగ్గించి, అతని అభిరుచికి అనుకూలంగా ఆకర్షణీయంగా కథ చెప్పేది.

సుబ్బమ్మగారికి మాత్రం కోడలూ మనుమడూ ఇంత కలిసిమెలిసి కథలు చెప్పుకోడం అట్టే యిష్టముండేది కాదు. కాని ప్రకాశంసంతోషానికి భంగం కలుగుతుందని ఎల్లాటి అడ్డంకులూ వెయ్యకుండా ఊరుకొనేది. అంతేకాదు. సుందరి చెప్పే కథలు తనకుకూడా ఎంతో బాగుండడంచేత ఎందు కీకథలు, పుణ్యమా పురుషార్థమా అని మొదట్లో అన్నా చాలా సంతోషంతో వినేది; కాని కొంచెంసేపట్లోనే ఆమె కుతూహలలేశం నిద్రావేశంలో అంతర్లీనమై పోవడంతో ఆమె ఏకథా సంపూర్తిగా వినక, మర్నాడు 'అయితే ఆదొంగవెధవ ఆరాజుకూతుర్ని పెళ్లాడేసేడన్నమాట' అని ప్రకాశంతో అనేది.

'అయ్యో నాయనమ్మా! నువ్వక్కడే నిద్దరపోయేవా? ఇంకా ఎంతకథుం దనుకున్నావు? చెప్పమన్నావా ఇప్పుడు?' అని మధ్యమధ్య మరిచిపోయిన దగ్గర పిన్ని నడుగుతూ కథ పూర్తిచేసేవాడు. సుబ్బమ్మగారికి కోడలు కథచెపితే ఉన్న సొగసు మనుమడు చెప్పినప్పుడు లేదని స్పష్టంగా కనిపిస్తున్నా కాదనుకుందికే ప్రయత్నం చేసేది.

* * * *

ప్రకాశానికి ఆవూర్లో పని అయినదగ్గరనుండి తనకు సరిఅయిన సహవాసం దొరికిన ట్టనిపించింది. భోజనం చేయడానికి తప్పిస్తే ఇంటికి వచ్చేవాడే కాదు. అదీ నాలుగైదు కబుర్లు వెల్లిన తరవాతే. రాత్రికూడా పండ్రెండుగంటలు దాటినతరవాతగాని పడుకుక్కుందికివచ్చేవాడు కాడు. తన బడిలోనే పని చేస్తున్న మరియిద్దరు మేష్టర్లూ, రెండవ ఫారంతో చదువు సమాప్తిచేసిన ఆవూరి కరణంగారి తమ్ముడూ, మునసబుగారి ఇల్లరికపు అల్లుడొకడూ కలిసి పేకాట వేసేవారు. మొదట్లో పండుగుదినాల్లోమాత్రం డబ్బువేసి మిగతా రోజుల్లో ఊరికే ఆడుకొనేవారు. కాని డబ్బులేని ఆటలో ఏమీ మజా కనిపించక పోడంతో అనుదినమూ డబ్బువేసే ఆడుకొనేవారు. వారి తృప్తి ఏమిటంటే తమ డబ్బు తమ మధ్యనే ఉంటుందికాని పైకి ఎక్కడకూ పోలేదుకదా అని. ఇదివరకు ఎల్లాటి అలవాట్లూ సరదాలూ లేక ఏదో యంత్రంలో సంచలించే ప్రకాశానికి ఇక్కడికి రావ

డం ఏదో మహాసంతోషప్రవంతిని చేరుకున్నట్టనిపించింది. ఏది ముందో ఏది వెనకో చెప్పలేము గాని అతనికి కారాకిల్లీ, పొగచుట్టాకూడా అలవాటయినాయి. అయితే యీ రెండూకూడా పేకాట బాగా అభ్యాసమయినతరవాత వచ్చినవే.

చిన్నతనంనుండీ యీ ఆటలో బాగా ఆరితేరిన వారితో మధ్యలో ఆరంభించిన తనకు ఆడడం చాలా కష్టంగానే ఉండేది. అయితే నిరంతరమూ అదేపనిగా ఆడడంవల్ల అతనికీ బాగానే పట్టుబడింది. కాని ఎంత లేదనుకున్నా యింతో అంతో నష్టమేగాని లాభమన్నది ముచ్చటకేనా లేకపోయేది ప్రకాశానికి. మొదటి రెండుసంవత్సరాలలోనూ, ఉద్యోగం అయిన నాటికి మిగిలిన ౩౫౦ రూపాయిలలోనూ బట్టలూ మొదలయినవాటి కయిన ఏయాభయ్యో తప్ప మిగిలినవి యావత్తూ పేకాటలో పోయినట్టే. 'ప్రకాశం! ఈ కాస్తా నీవివాహవ్యయానికి పనికివస్తుంది. ఎంత అవసరం వచ్చినా వాడకు' అని చెప్పిన సుందరికి ఈ విషయం తెలియనేతెలియదు. కొన్నాళ్లు తనకు వచ్చే (పేకాటలో) లాభంతో యీ నష్టం భర్తీచేద్దా మనుకున్నాడుగాని క్రమంగా ఆరకపు ఆశ అంతరించడంతో ఒకవేళ పిన్ని తనను ప్రశ్నిస్తే ఏమని జవా బివ్వడం అని తనలో తానే చాలా ఆందోళన పడేవాడు. పెట్టెలో మిగిలిన ఆఖరి అయిదురూపాయల కాగితాన్నీ తీస్తున్నప్పుడు అతనిని ఏదో కొత్త సిగ్గు ఆక్రమించుకొంది. ఇకముందు ఆడకూడదు అని నిశ్చయించుకున్నాడు. మంచం వీధి అరుగుమీద మాని లోపల వేసుకొని పడుకున్నాడు. అందరికంటే గంట ముందుగా వచ్చే ప్రకాశం నాడు వేళ అతిక్రమిస్తున్నా రాకపోడం మిత్రమండలిలో పెద్దఅలజడికి కారణమయింది. ఒక అరగంట చూసేరు.

"ఒరే, బ్రదర్! మన ప్రకాశిగా డింకా రాలే దేమిట్రా? మనం గాని డబ్బా కడుతున్నట్టు వీ డేమేనా కనిపెట్టే డంటావా?"

"అబ్బే! వాడి మొఘం! అంత కనిపెట్టి కూడా మాట్లాడకుండా ఊరుకొనేపాటి తెలివి తేటలు కూడానా?"

"కాని, ఒరే, వాడింత సనవకదా! అసలు అక్కడి మాత్రం వాడికి తగిన చోర వేడిసిందా అని."

"నో! నో! వీడు అమాయకు డైతే ఏమి? అదే అవతలివాళ్లకి మంచి అవకాశం. ఆడు తిమ్మా అంటే ఆడడానికీ, పాడు తిమ్మా అంటే పాడడానికీ-"

"అసలు వీడికి పెళ్లి కాకపోడానికి యిదో ముఖ్య కారణ మట."

"అది కాదోయ్. వీళ్ల మేనమామదగ్గరే ఎదిగిన కూతు రుందట. ఈ పాతిక రూపాయల ఖర్మ మేమి, రైల్వేలో మంచి ఉద్యోగం వేయిస్తాను రమ్మన్నాట్ట. అయితే మనవాడి కాపిల్ల సుతలామూ నచ్చలేదట. అంటే నచ్చకపోడం. వీళ్ల పిన్నికి- దాంతో వీడికీ నచ్చలే దన్న మాటే కదూ,"

"ఇంతకీ నచ్చడానికీ నచ్చకపోవడానికీ వాడికి మరి పెళ్లి అవుసరమే కనిపించలేదు."

"ఏమో మనకి బాగా తెలియని సంగతినిగూర్చి యిల్లా అనుకోటం మంచిపద్ధతి కాదు."

"తెలియకపోడం ఏమిటి లే- వాళ్ల నాయనమ్మ స్వయంగా వచ్చి మాదొడ్డమ్మతో మధ్యాహ్నం అల్లా యిదే గోల."

"సరే యీ హస్కు కేం గాని- అప్పుడే ఎనిమిదిన్నర అయింది. ఎవణ్ణేనా గుంటణ్ణి పంపిద్దామేమిటి రమ్మని. అందాకా మనం అయిదుగురి మీదా వేసుకుందామా?"

ప్రకాశాన్ని పిలవడానికి వెళ్లిన కుఱ్ఱవాడు ఆయనకు తలనొప్పిగా ఉండడంచేత రాలే నన్నారని కబురు తెచ్చేడు.

*   *   *   *

"చిన్నప్పుడేమో జబ్బంటేమాత్రం ఏం? దగ్గర సంబంధం. ఉభయఖర్చులూ పెట్టుకొని పెళ్లి చేస్తానన్నాడు. మొన్న వాళ్ల సూరీడు చూసిందిట. సళాకులా బంగారచ్చులాగుందిట. కడిగేసిన స్ఫటికం గాని పిల్ల కాదుట. ఏమయితేనేం, నీపెళ్లి అవగా చూసి సంతోషించే భాగ్యం నాకు లే"దని నాయనమ్మ సంతతమూ వాపోవడంతో ప్రకాశానికి తన

యిష్టాయిష్టాలు ఎలా వున్నా యీగోల వదిలించుకోడానికేనా ఏదో పిల్లని చేసుకుంటే బాగుణ్ణనిపించేది. కాని అంతలోనే మెఱుపుమెఱిసినట్టు "చూడు ప్రకాశం, నే నాపిల్లని చిన్నప్పుడు చూసేను. బాగానే ఉంది కాని కొంచెం చీడికళ్లు. అంతేకాక వీళ్లు చెప్పిన మాటలనే కొంచెం లోతుగా తరిచిచూస్తే ఆపిల్లకి అప్పుడే క్షయ అంకురించిందేమో అని నాకు భయంగా ఉంది. అల్లాటి పిల్లను చేసుకోడం ఎప్పటికేనా ప్రమాదమే. వెయ్యి అబద్ధాలాడైనా ఒక యిల్లు నిలబెట్టాలనే లౌక్యులు తాము నిలబెట్టదలచుకొన్న యింటిని తమ అబద్ధాలమూలంగానే పునాదుల్లోంచీ పడదోస్తున్నామని గ్రహించకపోడంచేత పెళ్లిమాటలు మాట్లాడ్డమంటే, నిజంలాగే కనిపించే అబద్ధాలను నేర్పుగా ఆడడమని అర్థం తేలింది. సరే దానికేం. మాటకి నువ్వాపిల్లను చేసుకున్నా వనుకో. నిరంతరమూ దగ్గుతూ నీరసమని మూలుగుతున్న ఆపిల్లవల్ల నీకేం సౌఖ్యం ఉంటుంది? ఒకవేళ ఆపిల్లకు పిల్లలు పుడితేమాత్రం మొదటినుండి రోగగ్రస్తులవడం నిశ్చయం. అప్పుడు నీజీవితం ఎంత దుఃఖభాజన మవుతుందో చూసుకో" అన్న పిన్నిమాటలు వెంటనే ఆలోచనాపథంలోకి రావడంతో యథాస్థితికి వచ్చేవాడు ప్రకాశం.

* * * *

పేకాటకు పోకుండా రెండుమూడురోజులుండడమే ప్రకాశానికి బ్రహ్మాండమయింది. తిరిగీ పూర్వపు టుత్సాహంతోనే ఆట సాగించడం మొదలుపెట్టేడుగాని పూర్వంలాగ పెట్టెలోంచి డబ్బు తీసుకొని వెళ్లి ఖర్చుపెట్టడానికి లేకపోడంతో నెలజీతంలోదికూడా కొంత ఖర్చుపెట్టవలసివచ్చేది. ఇంటికి కావలసిన వస్తువులు చాలావరకూ అరువుగా తేవలసిరావడం చాలా చిన్నతనంగానూ, భయంగానూ తోచినప్పటికీ వేళ అయేసరికి తనకు తెలియకుండానే మిత్రమండలివద్దకు కాళ్లీడ్చుకొనిపోయేవి.

ప్రకాశంలోని ముఖ్యమయిన ఒక గుణం ఏమిటంటే, యితరులు వాగ్రూపకంగా తన్నేమనుకున్నా లెక్కచేయకపోడమే. అందులోనూ పేకాటలో ఉన్న సమయంలో అతనికి తక్కిన ప్రపంచమే స్మృతిదూర మవుతుంది. స్నేహితులు ఎగతాళికి వేసే ప్రశ్నలకు సయితమూ సరియయిన సమాధానాలనే యిస్తూ, మధ్యమధ్యను వారిని ఆట మరిచిపోవద్దని హెచ్చరిస్తూఉండేవాడు. ఎవడేనా మిత్రుడు "ఒరేయ్! ప్రకాశ్! మొన్న నీ కిస్తామన్న పిల్ల నచ్చకపోడం మీయింట్లో ఎవరికి? నీకా మీపిన్నికా" అని అడిగినప్పుడు ప్రకాశం "అసలు నే నాపిల్లని చూడనేలేదు. మాపిన్నే చూసిందట. ఏదో జబ్బుకూడా ఉన్నట్టనుమానమట. ఊఁ, నరసింహం! నీదీ చేతివరస — ఏమిటి? ఒకటేనా—"

* * *

సుందరి కొంతకాలం మేనమామగారింట ఉండి వస్తానన్నప్పుడు ప్రకాశానికి ఎంతమాత్రమూ యిష్టం లేదుగాని ఆమెను ఆమెనిశ్చయంనుండీ వేరుపరచడానికి తగిన ధైర్యమూ, శక్తికూడా తనలో లేవని తెలియడంచేత మాట్లాడకుండా ఆమెను స్టేషనువరకూ దిగబెట్టి ఇంటికి వచ్చేడు.

ఏదైనా వస్తువును పోగొట్టుకున్న కుఱ్ఱవాడు ఆవస్తువు అక్కడ ఉండదని తెలిసినా వెతికినచోటే మళ్లీమళ్లీ వెతుకుతాడు. ప్రకాశానికి పెట్టెలో మరి డబ్బు లేదని తెలిసికూడా మరొక్క మారు వెతకాలని బుద్ధిపుట్టింది. కొంచెం చిల్లర తప్పిస్తే మరేమీ కనిపించలేదు. తిరిగి వేసేముందు చిల్లరడబ్బుల ప్రక్కనే ఉన్న పాతకాగితం ఒకటి అతని దృష్టిని ఆకర్షించింది. సామాన్యంగా ప్రకాశాని కిలాటివి చూడడమభ్యాసము లేదుగాని ఆనాడు చేతులో డబ్బేమీ లేకపోడంచేత విప్పిచూడాలనిపించింది. అందులో—

"ప్రకాశం! నే నిక్కడ ఉండడం లౌకికదృష్టిలో కొంతవరకూ నీశ్రేయోభివృద్ధికి భంగకారిగా ఉన్నట్టే ఉంది. నీ అవివాహితస్థితిలో నా వునికి నిష్కారణంగా అనేకదుష్ప్రవాదాలకు ఆధారభూత మవుతున్నట్లు యిటీవల నాకు చూచాయగా తెలియడమే నా యీ ప్రయాణానికి కారణం. నా మంచిచెడ్డలనుగురించి ఆలోచించి, పరితపించే పరిస్థితిని నేను చాలాకాలం క్రిందటే దాటిపోయేను. గాని నా

మూలంగా నీకు అన్యాయం జరగడం నేను సహించలేను.

—రాముని నీవద్దనే ఉంచిపోతున్నాను. వాడిని అవకాశం ఉన్నంతవరకూ చదివించు. వాడిపట్ల నాకు ఉన్నంత బాధ్యత నీకూ ఉంది.

—నీవు నీ ఉద్యోగం అయిననాటికి మిగిలిన సొమ్మంతా పేకాటలో పోగొట్టుకున్న సంగతి నే నీమధ్యనే గ్రహించాను. ఇంతకాలం ఊరుకోడం నాదే పొరబాటు. ప్రస్తుతం నానగలన్నీ విడిచిపోతున్నాను. వీటిలో నీ పెళ్లి ఖర్చులకు కావలసినంతమాత్రమే అమ్మి తక్కినవి నీవు చేసుకోబోయే పిల్లకు యథాతథంగా పెట్టు. (వీటిలో రాముకోసం ఏమీ మిగల్చనక్కరలేదు.) కాని మరొక సంగతి. పెళ్లి చేసుకోనేముందు అందమయిన, ఆరోగ్యమయిన పిల్లను స్వయంగాచూసి చేసుకో. కొత్త ఎదిగిన పిల్ల అయితే మీనాయనమ్మకు గృహకృత్యాల్లో చేదోడుగా ఉంటుంది.

—మంచిసెబ్బరలు రెండూ సమానంగానే ఉన్న నేను నాగురించి మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్లలేదు. అనవసరంగా నాగురించి ఆందోళన పడవద్దు. మీనాయనమ్మగాని గ్రామస్థులుగాని నన్నేమన్నా సరే వివాదపడవనే నా ఆశా, నాప్రార్థనాకూడా.

—నువ్వేమీ రాయనక్కరలేదు; రాయవలసి ఉంటే నేనే రాస్తాను.

పిన్ని"

ప్రకాశానికి ఏంచేయాలో తోచలేదు. (కాని ఒట్టుపెట్టినట్లు ఆనాటినుండీ పేకాటకుమాత్రం పోలేదు.)

ఒక ఆర్నెల్లలో అతనికి పెళ్లిఅయి భార్య యింటికి రావడంతో కలిగిన ఆనందం సుబ్బమ్మగారికి ఒక వారంరోజులకంటే ఎక్కువగా నిలవలేదు. జానకిది (ప్రకాశంభార్య) ఒకరు అనవసరంగా అంటే పడి ఊరుకొనే స్వభావం కాదు. ప్రకాశం యింటికి వచ్చేసరికల్లా ప్రతిదినమూ వంటయింటినుండి, పడంగదినుండి సమానస్థాయిలో మూలుగులూ, ప్రత్యక్షకగానూ పరోక్షంగానూ ఎన్నుకొనే నేరాలూ విని పిస్తూఉండేవి. ప్రకాశానికి ఏమనాలో, ఏం చేయాలో తెలిసేదికాదు. ఒంటరిగా ఏటిగట్టున కూర్చొని ఎప్పటికేనా పిన్ని మళ్లీ వస్తుందనీ, అప్పుడీకంగాళ్లేమీ ఉండవనీ మనసా విశ్వసించగలిగిన పరమ సత్యాన్ని అప్పుడప్పుడు రాముతోమాత్రం వెల్లడి చేస్తూ ఉండేవాడు. పిన్ని ఎవరితోనో లేచివెళ్లిపోయిందనీ, అతనికీ ఆమెకూ ఏమో వివాదం వచ్చి తాను వేరే ఆడపిల్లలకు చదువూ సంగీతమూ ట్యూషన్లు చెప్పుతున్నదనీ, ఆమెవంటి వాళ్లవల్లనే దేశం యిలా అధోగతిపాలయిందనీ వాళ్లూ వీళ్లూ అన్న మాటలు కేవలం యీర్ష్యాకల్పితాలుగామాత్రమే తనకు తోచినా ఇతరులను నమ్మించలేకపోయే ననే అతని మనోవ్యథ. అయితే అతని మనఃపరిస్థితిని సాదరభావంతో గుర్తించి అతని వుద్దేశాలను సావధానంగా విశ్వసించే వ్యక్తి యీఅనంతవిశ్వంలోకల్లా ఒక్క రాముమాత్రమే అని గ్రహించడానికి అతనికి అట్టేకాలం పట్టలేదు. అయితే పిన్నినిగురించి మాట్లాడుతున్నంతసేపూ తమ యిద్దరి మధ్యా పద్దెనిమిది దీర్ఘవత్సరాల భేదం ఉందన్న విషయమే అతని యోచనాపథంలోకి రాదు.